## క్లుప్తంగా

### నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీ సీతారామ సేవా మండలి నూతన కార్యవర్గ సభ్యులు

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో శ్రీ సీతారామ సేవా మండలి నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు, ఉపాధ్యక్షుడిగా మద్ది శశిభూషణరెడ్డి, కార్యదర్శిగా సూరిశెట్టి అప్పలరాజు(బుజ్జి), సహాయ కార్యదర్శిగా సూరిశెట్టి సత్యనారాయణ, కోశాధికారిగా పెంటకోట రమేష్, ఆడిటర్‌గా రాపేటి గోవిందరాజు, ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. వీరు ఏడాది పాటు పదవిలో కొనసాగుతారు.

### సింహగిరిపై నృసింహ హోమం

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సింహగిరిపై నృసింహ హోమం వైభవంగా జరిగింది. ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో హోమం నిర్వహించారు. ఉభయదాతలు ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారు.

### 'వికసిత్ భారత్' జిల్లా కో కన్వీనర్‌గా 'మూల'



మూల వెంకటరావు

**మద్దిలపాలెం:** వికసిత్ భారత్ జిల్లా కో కన్వీనర్‌గా బీజేపీ నాయకుడు మూల వెంకటరావు నియామకమయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వికసిత్ భారత్ 2047 సదస్సులో ఆయనను కో కన్వీనర్ నియమించారు. తనకు కీలక పదవి అప్పగించిన పరుశురామ్‌రాజు, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మాధవ్‌లకు వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు.

### ఈతకు వచ్చిన యువకులకు కౌన్సెలింగ్



ఆనకట్ట వద్ద యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శ్రీధర్

**పద్మనాభం:** మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో గోస్తని నదిలో ఉన్న ఆనకట్ట వద్దకు ఆదివారం ఈతకు వచ్చిన యువకులకు సీఐ సీహెచ్ శ్రీధర్ కౌన్సెలింగ్ చేశారు. విశాఖపట్నం పెదవాల్తేరు, జ్ఞానాపురం ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి ఈతకు వచ్చారు. మద్యం సేవించి దుర్భాషలాడడంతో స్థానికులు పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ, పోలీసులు ఆనకట్ట వద్దకు వెళ్లి వీరికి కౌన్సెలింగ్ చేశారు. ఆనకట్ట వద్ద ఈతకు దిగడం ప్రమాదకరమని, స్థానికులను దుర్భాషలాడడం చట్టరీత్యా నేరమని సీఐ వారికి తెలియజేశారు. ఎనిమిది మందిపై పెట్టీ కేసు నమోదు చేశారు.

### ఛాతి నొప్పితో కారు డ్రైవర్ మృతి



మృతుడు దేవారావు

**తగరపువలస:** ఆనందపురం మండలం నీళ్ల కుండీల కూడలి వద్ద ఆదివారం సాయంత్రం ఆరిలోవకు చెందిన కారు డ్రైవర్ పి.దేవారావు (45) ఛాతీనొప్పితో మృతి చెందారు. దేవారావు తన కారులో కొంతమంది స్థానికులను అనకాపల్లి జిల్లాలోని పైడివాడ అగ్రహారంలో జరిగిన ఒక ఫంక్షన్‌కు తీసుకెళ్లారు. అక్కడ నూకాలమ్మ దర్శనం చేసుకున్న తర్వాత, ఆరిలోవకు తిరిగి వస్తున్నారు. అక్కివరం పీఎస్ఎల్ వద్ద ఆరిలోవ వెళ్లేందుకు సర్వీస్‌రోడ్డులోకి మారాల్సి ఉండగా, దారి తప్పి నీళ్లకుండీల కూడలికి చేరుకున్నారు. ఆ సమ యంలో ఆయనకు ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో కారును పక్కకు తీసి ఆపారు. వెంటనే హైవే అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరీ క్షించగా, అప్పటికే దేవారావు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు ఆరిలోవలోని చివరి బస్టాప్ వద్ద నివాసం ఉంటున్న ఆయనకు భార్యాపిల్లలు ఉన్నారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వైద్యం.. అందనంత దూరం



- ఆరోగ్య కేంద్రం కోసం 28వ వార్డు వాసుల ఎదురుచూపులు
- స్థల వివాదంతో వేరే వార్డుకు తరలింపు
- అనారోగ్య సమస్యలొస్తే ఇబ్బంది పడుతున్న స్థానికులు
- తమ ప్రాంతంలో ఆస్పత్రి నిర్మించాలని విజ్ఞప్తి

**బీచ్‌రోడ్డు:** తమ వార్డులో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) నిర్మిస్తున్నారని ఆనందించే లోపే.. దానిని వేరే వార్డుకు తరలించడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమకు వచ్చే చిన్న చిన్న వ్యాధులకు ఉచితంగా ఇంటి దగ్గరలోనే వైద్యం అందుతున్న వారి ఆశలు అడియాశలుగా మిగిలిపోయాయి. అనారోగ్యానికి గురైనప్పుడు తమ ప్రాంతానికి దూరంగా ఉండే ఆస్పత్రులకు ఇబ్బందులు పడుతూ వెళ్లి వైద్యం పొందాల్సి వస్తోందని 28వ వార్డు ప్రజలు వాపోతున్నారు. తమ వార్డులో ఆరోగ్య కేంద్రం అవసరమని, తక్షణం ఏర్పాటు చేసి, వైద్య సేవలందించాలని కోరుతున్నారు.

**ఆనందించే లోపే ఆవిరి**

ఎంతో వేగంగా కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రం పనులకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. ఆ స్థలం తమదని సొసైటీ వ్యక్తులు కోర్టులో కేసు వేయడంతో దీని నిర్మాణంపై స్టే విధించింది. దీంతో 28వ వార్డుకు కేటాయించిన ఆరోగ్య కేంద్రాన్ని 20వ వార్డుకు పెదవాల్తేరుకు తరలించారు. తమ ప్రాంతంలో ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్నారని ఎంతో ఆనందించిన ప్రజలకు ఒక్కసారిగా నిరాశ ఎదురైంది.

**నిరుపయోగంగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్**

ఇదే నెహ్రూనగర్‌లో ఉన్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ శిథిల స్థితికి చేరి నిరుపయోగంగా మిగిలింది. 1,500 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ హాస్టల్ స్థలం పూర్తిగా ప్రభుత్వానిదే. దీంతో ఈ ప్రదేశంలో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఉమెన్స్ హాస్టల్‌కు మరమ్మతులు చేసి ఆరోగ్య కేంద్రంగా వినియోగించాలని లేదా.. నూతన యూపీహెచ్‌సీ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

**అధికారుల సమన్వయ లోపం**

ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించినా.. నిధులు సైతం కేటాయించినా అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లే యూపీహెచ్‌సీ ఇంకా ఏర్పాటు కాలేదు. ప్రభుత్వ స్థలం ఉన్నా సరే జీవీఎంసీ, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయం లోపించిందని, అందువల్లే పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ చొరవ చూపి తమ ప్రాంతంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని 28వ వార్డు ప్రజలు కోరుతున్నారు.



వార్డులో నిరుపయోగంగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్

**గత ప్రభుత్వంలో ఆరోగ్య కేంద్రం కేటాయింపు**

**జీవీఎంసీ 28వ వార్డులోని రామ్‌నగర్, జై సంతోషమాతా కాలనీ, పీతానిదిబ్బ, నెహ్రూనగర్ వంటి ప్రాంతాల్లో బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చినా కేజీహెచ్ వంటి పెద్ద ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి వీరిది. ముఖ్యంగా చిన్న చిన్న రోగులకు** కూడా కేజీహెచ్‌కు వెళ్లి గంటల తరబడి వేచి ఉంటూ వైద్యం పొందుతున్నారు. దీంతో ఇక్కడి ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వార్డులో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాలని నిర్ణయించింది. వార్డు ప్రజల కోరిక నెరవేర్చుతూ ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసింది. దీనిని నెహ్రూ నగర్‌లోని ఓ ఖాళీ స్థలంలో నిర్మించేందుకు అనుమతులను జీవీఎంసీ ఇచ్చింది. దీంతో ఆ ప్రాంతంలో ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను ప్రారంభించారు.



28వ వార్డు నెహ్రూ నగర్‌లో నిర్మించి.. నిలిపివేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

### ఆరోగ్య కేంద్రం అవసరం



మా వార్డులో బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. వారికి ఆరోగ్యం బాగాలేకపోతే కేజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోంది. సమయంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మా వార్డులో గతంలో కేటాయించిన ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి ప్రజలకు వైద్య సేవలందించాలి.

– వల్లా అప్పలకొండ, 28వ వార్డు కార్పొరేటర్

### సంతోషం ఆవిరైంది



మా ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్నారని తెలిసి చాలా సంతోషపడ్డాం. ఏ అనారోగ్య సమస్య వచ్చినా ఇంటి దగ్గరలోనే ఆస్పత్రి ఉంటుందని ఆనందపడ్డం. ఇంతలోనే స్థల వివాదం కావడంతో దానిని వేరే ప్రాంతానికి తరలించారు. మా ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆరోగ్య కేంద్రం నిర్మించాలి.

– జి.విశాలాక్షి, నెహ్రూనగర్

### పెద్ద ఆస్పత్రే దిక్కు



మాకు ఏ అనారోగ్య సమస్య వచ్చినా దగ్గరలో ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో పెద్ద ఆస్పత్రి కేజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ గంటల తరబడి ఓపీ కోసం వేచి ఉండి వైద్యులకు చూపించుకోవాలి. దీంతో చాలా సమయం వృథా అవుతోంది. మా ప్రాంతంలోనే ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉంటే ఈ సమస్య ఉండదు.

– కె.లక్ష్మి, రామ్‌నగర్

## క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 13వ వార్డులో వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. 23వ వార్డు సీతమ్మధార రాధాకృష్ణ కల్యాణ మండపంలోని నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం పార్టీ 13వ వార్డు శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తలపెట్టిన ప్రతి కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. అందరూ కలిసికట్టుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలన్నారు. అందరూ ఏకాభిప్రాయంతో వార్డు, బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, సీనియర్ నాయకులు సత్యాల సాగరిక, జాన్ విక్టర్, శిరీష, వానపల్లి ఈశ్వరరావు వెంకట్, ఇమంది సత్యనారాయణ, వనం వరలక్ష్మి, వాసు, సుబ్బారావు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముడసర్లోవ రిజర్వాయర్‌లో చేపల మృత్యువాత





ముడసర్లోవ రిజర్వాయర్‌లో మృతిచెంది నీటిలో తేలుతున్న వందల కొలది చేపలు

**ఆరిలోవ:** ముడసర్లోవ రిజర్వాయర్‌లో చేపలు మృత్యువాత పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వందల కొలది చేపలు మృతిచెందడంపై స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. మత్స్యాలు ఎక్కువైతే అక్కడ నీటిలో గుంపులుగా తేలుతూ కనిపించాయి. నీటిలో కలుషితాల కారణంగా ఇలా మృత్యువాత పడ్డాయా, లేదంటే ఎవరైనా నీటిలో ఏదైనా విష ప్రయోగం చేశారా అంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిలో ఎక్కువ మంది పూజా సామగ్రి కలుపుతుంటారు. అవి నీటి అడుగు భాగంలో కుప్పలుగా చేరుతున్నాయి. దీంతోపాటు ఇక్కడ నీటిపై తేలియాడే సోలార్ పలకలు రిజర్వాయర్‌లోని సగ భాగంలో అమర్చారు. దీని వల్ల నీటికి సూర్యరశ్మి తగలడం లేదు. దీని ప్రభావం ఏమైనా చేపల మనుగడపై పడిందా అనే కోణంలో కొందరు ఆలోచనలో పడ్డారు.

## ఘనంగా కనకదుర్గమాంబ ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట గ్రామ ఇలవేల్పు శ్రీ కనకదుర్గమాంబ ఆలయ వార్షిక పండగ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం చాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఇసుకతోట ప్రాంతం పండగ శోభను సంతరించుకుంది. ఈ నెల 10న జరిగే అనుపు మహోత్సవానికి ప్రముఖులను ఆహ్వానించేందుకు కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను ఆలయంలో ఆవిష్కరించారు. సోమవారం తొలేళ్ల సంబరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ ఉమా మహేశ్వర సాయిదుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు గొలగాని అప్పారావు, బొట్టా శివ, అధ్యక్షుడు ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ప్రసాది అప్పారావు, కార్యదర్శి ఒమ్మి గోపికృష్ణ, కోశాధికారి గొలగాని రాజు, ఈగల శివ గోవింద్, పల్లా అప్పారావు, బొట్టా గణేష్, పల్లా శివ, ముమ్వల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఆనంద తీరం.. ఆరోగ్య యోగం



**ఏయూక్యాంపస్:** అంతర్జాతీయ యోగా దినోత్సవానికి నగరం సిద్ధమవుతోంది. సాగరతీరం వేదికగా జరగనున్న ఈ కార్యక్రమానికి దేశ ప్రధాని మోదీ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా యోగాపై అవగాహన కల్పిస్తూ వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సాగర తీరంలో పలువురు యోగా సాధన చేస్తూ కనిపించారు. ఇసుక తిన్నెలపై కూర్చుని యోగా, ధ్యానం చేశారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## వీఎంఆర్‌డీఏ 'డెక్' భవనం పరిశీలన



డెక్ భవనంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

**మహారాణిపేట:** వీఎంఆర్‌డీఏ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'డెక్' భవన సముదాయాన్ని ఆదివారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్న ఈ భవనానికి సంబంధించిన అన్ని పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భవనంలో అన్ని మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం పర్యటన తేదీ ఖరారయ్యే నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి భవనాన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సముద్రాలను సంరక్షించుకోవాలి





బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న ఏయూ వీసీ రాజశేఖర్, పలు సంస్థల సిబ్బంది



తీరంలో వ్యర్థాలను సేకరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు





**ఏయూక్యాంపస్:** భావితరాల కోసం సముద్రాలను పరిరక్షించాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాగర తీరాన్ని శుభ్రం చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ స్వయంగా బీచ్ రోడ్డు తీరంలోని వ్యర్థాలను సేకరించారు. దశాబ్ద కాలంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సముద్రాలు సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. మొత్తం 135 కిలోల వ్యర్థాలను సేకరించి జీవీఎంసీకి అందజేశారు. కార్యక్రమంలో సీఎంఎఫ్‌ఆర్‌ఐ, సీఐఎఫ్‌టీ, ఎన్‌సీసీఆర్, ఎస్‌ఎస్‌టీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల సిబ్బంది, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, జువాలజీ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## బీచ్ రోడ్డు.. వ్యర్థాలు బోలెడు



డస్ట్ బిన్ చుట్టూ వ్యర్థాలు



బీచ్ రోడ్డు ఫుట్‌పాత్‌పై వ్యర్థాలు, కవర్లు



వ్యర్థాలతో నిండిపోయిన డస్ట్ బిన్లు



బీచ్ రోడ్డులో మాయమైన డస్ట్ బిన్లు

**ఏయూక్యాంపస్:** సాగర తీరంలో పరిసరాలు కంపు కొడుతున్నాయి. బీచ్ రోడ్డులో ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చేవారికి, పర్యాటకులకు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. బీచ్ రోడ్డులోని డస్ట్ బిన్‌ల నిండా వ్యర్థాలు, ఫుట్‌పాత్‌లపై తిని పడేసిన ఆహార పదార్థాల డబ్బాలు, కవర్లు దర్శనమిస్తున్నాయి. మిగిలిన ఆహారాన్ని తినడానికి కుక్కలు, కాకులు ఈ కవర్లను ఫుట్‌పాత్‌లపై పడేస్తున్నాయి. దీంతో సుందరమైన సాగర తీరాన్ని చూడాలని వచ్చే వారికి ఇటువంటి పరిస్థితులు ఇబ్బందికరంగా మారాయి. కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లు నిండిపోయి కనిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో అవి లేవు. పారిశుధ్య సిబ్బంది ఈ వ్యర్థాలను రాత్రి వేళల్లో శుభ్రం చేస్తే ఉదయాన్నే బీచ్‌కు వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా, మరింత ఆహ్లాదంగా నిలుస్తుంది. ఈ దిశగా పారిశుధ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.





సాగర తీరమంతా ఆదివారం సందడి వాతావరణంతో కోలాహలంగా మారింది. వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో పిల్లలతో కలిసి నగరవాసులు అధిక సంఖ్యలో బీచ్‌కు వచ్చారు. ఆర్.కె.బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు సందడి చేశారు. ఇసుకలో ఆడుకుంటూ, సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. తీరం పొడవునా ఉన్న పార్కులు, పర్యాటక ప్రాంతాలన్నీ నగరవాసులు, సందర్శకులతో కిక్కిరిసిపోయాయి. విక్టరీ ఎట్ సీ వద్ద లేజర్ షో ఆకట్టుకుంది. 1971 యుద్ధ విశేషాలను వివరిస్తూ షో ప్రదర్శించారు

– ఏయూక్యాంపస్